సాక్షి
వికారాబాద్
గురువారం ı 16 ı ఫిబ్రవరి ı 2023



బిల్లుల కోసం..
రైతు వేదికలు నిర్మించి రెండేళ్లవుతున్నా ఇప్పటికీ బిల్లులు రావడంలేదని ఆయా గ్రామాల సర్పంచ్‌లు వాపోతున్నారు. 8లో▸



కల్వర్టులు.. ప్రమాద ఘంటికలు
బంట్వారం మండలంలో కూలిపోయిన కల్వర్టులు మరమ్మతులకు నోచుకోవడంలేదు. ప్రమాదాలకు నిలయంగా మారాయి. 8లో▸



అప్‌గ్రేడ్ అయ్యేదెప్పుడో?
గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంలో సర్కార్ విఫలమవుతోంది. పీహెచ్‌సీలు అప్‌గ్రేడ్‌కు నోచుకోవడంలేదు. 9లో▸

న్యూస్‌రీల్

విద్యార్థులకు నేడు వ్యాసరచన పోటీలు

తాండూరు టౌన్ : సీఎం కేసీఆర్ జన్మదినం పురస్కరించుకుని గురువారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్వీ విద్యార్థి విభాగం ప్రతినిధి దీపక్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో కేసీఆర్ పాత్ర' అనే అంశంపై ఉదయం 11 గంటలకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వ్యాసరచన పోటీ ఉంటుందన్నారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియాల్లో వ్యాసరచన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.3 వేలు, ద్వితీయ రూ. 2వేలు, తృతీయ బహుమతిగా రూ. 2 వేల నగదు పురస్కారాన్ని అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

బాధిత రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న కేవీపీఎస్ నాయకులు

యాలాల: మండల పరిధిలోని బండమీది పల్లిలో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు అంజిలయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్కయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ గోవిందమ్మకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్యకు పాల్పడటం తమను తీవ్రంగా కలిచివేసిందన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ.10లక్షల ఆర్థిక సహాయం అందజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కౌలు రైతులను సైతం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు ఉన్నారు.

భవిష్యత్‌లో బహుజనులదే రాజ్యాధికారం

బీఎస్పీ రాష్ట్ర కో ఆర్డినేటర్ చంద్రశేఖర్



నాయకులకు కండువా కప్పి బీఎస్పీలోకి ఆహ్వానిస్తున్న చంద్రశేఖర్ ముదిరాజ్

తాండూరు టౌన్: భవిష్యత్తులో బహుజనులదే రాజ్యాధికారమని బహుజన సమాజ్‌పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర కో ఆర్డినేటర్ బోయిని చంద్రశేఖర్ ముదిరాజ్ అన్నారు. బుధవారం పెద్దేముల్ నుంచి వెంకటేశ్, రత్నం, లక్ష్మణ్‌లతో పలువురు బీఎస్పీ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ జనాభాలో అత్యధిక సంఖ్యలో ఉన్న బడుగు బలహీన సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు, పరిపాలనకు నోచుకోలేకపోతున్నారన్నారు. అగ్రవర్ణాల నాయకులు అధికార దాహంతో ఎన్నికల్లో ధన ప్రవాహంతో అధికారాన్ని చేజిక్కించుకుంటున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు అంబరయ్య, నియోజకవర్గ అధ్యక్షుడు అరుణ్‌రాజ్, పెద్దేముల్ మండలాధ్యక్షుడు రమేష్, అసెంబ్లీ ఇన్‌చార్జి జైరామ్ తదితరులు పాల్గొన్నారు.

19న శివాజీ శోభాయాత్ర



మాట్లాడుతున్న శివాజీ శోభాయాత్ర నిర్వాహకులు

తాండూరు టౌన్ : పట్టణంలో ఈనెల 19న భారీ ఎత్తున శివాజీ శోభాయాత్రను నిర్వహిస్తున్నామని, హిందూ బంధువులందరూ తరలి రావాలని కార్యక్రమ నిర్వాహకులు కోరారు. బుధవారం తాండూరులో నిర్వాహకులు విలేకరులతో మాట్లాడుతూ. ప్రతి ఏటా ఛత్రపతి శివాజీ మహారాజ్ శోభాయాత్రను పట్టణంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక కాళికాదేవి ఆలయం నుంచి ఊరేగింపుగా శివాజీ చౌక్ వరకు శోభాయాత్ర నిర్వహిస్తామన్నారు. అనంతరం శివాజీచౌక్‌లో మహాసభ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు రజినీకాంత్, పూజారి పాండు, కావలి సంతోష్, టైలర్ రమేష్, కిరణ్ ముదిరాజ్, అశోక్, శ్రీనివాస్ తదితరులు కోరారు.

సేవాలాల్ జీవితం.. అందరికీ ఆదర్శం



ధారూరు: ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు

- ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్
- ఘనంగా జయంతి వేడుకలు

అనంతగిరి: గొప్ప ఆధ్యాత్మికవేత్త సంత్ సేవాలాల్ మహరాజ్ అని, ఆయన జీవితం అందరికీ ఆదర్శనీయమని ఎమ్మెల్యే మెతుకుఆనంద్ అన్నారు. బుధవారం సంత్‌సేవాలాల్ జయంతి సందర్భంగా వికారాబాద్ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. గొప్పవ్యక్తుల జీవిత చరిత్రలు చదివి స్ఫూర్తిపొందాలన్నారు. అడవి బిడ్డల ప్రకృతి ఆరాధన, ఆధ్యాత్మిక దృక్పథం సామాజిక సాంస్కృతిక జీవన విధానాన్ని కాపాడేందుకు సేవాలాల్ ఎంతో కృషి చేశారన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అదజేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.



వికారాబాద్ పట్టణంలో గిరిజనులతో కలిసి నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

ఉపాధ్యాయుల పోరు.. ప్రచారం జోరు

ఎమ్మెల్సీ ఎన్నికల సందడి షురూ
- విద్యాశాఖలో కోలాహలం
- పాఠశాలల్లో మొదలైన ప్రచారం
- జిల్లాలో ఓటర్ల సంఖ్య 1,936
- మార్చి 13న ఎన్నికలు



జిల్లాలో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు..

వికారాబాద్: జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందడి నెలకొంది. పాఠశాలలు, ఇతర విద్యాసంస్థల్లో ప్రచార హోరు మొదలైంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పదవీ కాలం త్వరలో ముగియనుండటంతో ఎన్నికల వేడి రాజుకుంటోంది. 2017 మార్చిలో హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు నిర్వహించగా పీఆర్టీయూ బలపర్చిన అభ్యర్థి కాటేపల్లి జనార్దన్‌రెడ్డి గెలుపొందిన విషయం తెలిసిందే. ఆయన ఆరు సంవత్సరాల పాటు ఆ పదవిలో కొనసాగగా వచ్చే మార్చి 29నాటితో ఆయన పదవీ కాలం ముగియనుంది. ఆలోగా మార్చి 13న ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఓటరు జాబితాలో పేర్ల నమోదు, తుది జాబితా ప్రకటన తదితర అంశాల్లో కసరత్తు పూర్తి చేసిన అధికారులు మండలాల వారీగా పోలింగ్ కేంద్రాలను సైతం గుర్తించారు. ప్రధాన ఉపాధ్యాయ సంఘాలు ఇప్పటికే తమ అభ్యర్థులను ప్రకటించటంతో పాఠశాలల్లో పర్యటిస్తూ ప్రచారం సైతం ప్రారంభించారు.

మూడు నెలలుగా కసరత్తు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అధికారులు మూడునెలలుగా కసరత్తు చేస్తున్నారు. ఓటరు జాబితాకు సంబంధించి ఎన్నికల కమిషన్ ఇప్పటికే మొదటి, రెండో పబ్లిక్ నోటీసులు విడుదల చేసిన విషయం తెలిసిందే. ఓటరు జాబితాలో పేర్ల నమోదు కోసం దరఖాస్తులు స్వీకరించటంతో పాటు ఓటర్ల తుది జాబితాను కూడా ప్రకటించింది. జిల్లాలో మొత్తం 1,936 మంది ఓటర్లు ఉండగా ఓటర్ల సంఖ్య ఆధారంగా మొత్తం 18 పోలింగ్ స్టేషన్లను గుర్తించారు. ఒక్కో మండలంలో ఒక్కో పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయగా జిల్లా కేంద్రం వికారాబాద్‌లో రెండు పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. అత్యధికంగా వికారాబాద్‌లో 564 మంది, తాండూరులో 445, పరిగిలో 290మంది ఓటర్లు ఉన్నారు. వచ్చే నెల 13న ఎన్నికలు నిర్వహించనున్నారు.

ప్రచారంలో ఉపాధ్యాయ సంఘాలు

హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, ఉమ్మడి మహబూబ్‌నగర్ నియోజకవర్గ పరిధిలో ప్రస్తుతం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహిస్తుండగా ఆయా ఉపాధ్యాయ సంఘాలకు చెందిన నేతలు అభ్యర్థుల తరపున ప్రచారం ముమ్మరం చేశారు. పీఆర్టీయూ తరపున ప్రస్తుత ఎమ్మెల్సీ జనార్దన్‌రెడ్డి, పీఆర్టీయూ తరపున ఆ సంఘం సీనియర్ నాయకుడు చెన్నకేశవరెడ్డి పేర్లను ఆ సంఘాలు ఖరారు చేశాయి. వామపక్ష అనుబంధ సంఘాలు అయిన టీఎస్‌యూటీఎఫ్ తరపున మాణిక్‌రెడ్డి, టీయూటీఎఫ్ తరపున మల్లారెడ్డిలను బరిలో దించాలని ఆ సంఘాలు నిర్ణయించాయి. ఇక బీజేపీ భావజాలంతో పనిచేసే తపస్ ఉపాధ్యాయ సంఘం నుంచి ప్రభుత్వ దిల్‌షుక్‌నగర్ పబ్లిక్ స్కూల్ నిర్వాహకులైన ఏవీఎన్‌రెడ్డి పేరును ఆ సంఘం ఖరారు చేసింది.

ఓటు వేసేందుకు అర్హులు వీరే..

కనీసం మూడు సంవత్సరాల పాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విధులు నిర్వహించిన స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీ, పండిట్ టీచర్లు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు అర్హులు. వీరితో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, గురుకుల పాఠశాలలు, డిగ్రీ, బీఎడ్ కళాశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు, ఆశ్రమ పాఠశాలలు, ఇంజనీరింగ్ కళాశాలల్లో రెగ్యులర్ ఉపాధ్యాయులుగా, అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్న వారు ఓటు వేయనున్నారు. గడిచిన ఆరేళ్ల కాలంలో పదవీ విరమణ పొందిన రిటైర్డ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులకు సైతం ఈ ఎన్నికల్లో ఓటువేసేందుకు అర్హత ఉంటుంది.

రైతు బాగుండాలి.. అందరూ బాగుపడాలి



కోర్టు ఆవరణలో కలెక్టర్ నారాయణ రెడ్డి, జిల్లా న్యాయమూర్తి సుదర్శన్ తదితరులు

- అన్నదాతల సమస్యల పరిష్కారానికి చర్యలు
- న్యాయవ్యవస్థ సహకారం అవసరం
- కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: రైతు బాగుంటేనే మనమంతా బాగుపడతామని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. బుధవారం వికారాబాద్ బార్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్‌తో పాటు జిల్లా న్యాయమూర్తి కె. సుదర్శన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సమస్యలు తీర్చేందుకు, రెవెన్యూ సమస్యలను అధికమించేందుకు న్యాయవ్యవస్థ సహకారం ఎంతో అవసరమన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించడంలో న్యాయవ్యవస్థ చాలా కీలక పాత్ర పోషిస్తున్నదని అన్నారు. భూముల రికార్డులను సరిచేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. అనంతరం జిల్లా న్యాయమూర్తి కె.సుదర్శన్ మాట్లాడుతూ భూముల సమస్యల పరిష్కారంలో మా సహకారం తప్పక ఉంటుందని తెలిపారు. భూ సమస్యలు పరిష్కారం అయితే 30 శాతం సివిల్ కేసులు తగ్గుతాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. మాధవరెడ్డి, ప్రధాన కార్యదర్శి జగన్ తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్ క్వార్టర్స్ పరిశీలన..

అంతకు ముందు కోర్టు సముదాయానికి స్థలం సరిపోవడం లేదని న్యాయవాదులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో పక్కనే ఉన్న నీటిపారుదల శాఖ, బ్లాక్ క్వార్టర్స్‌కు కేటాయించిన స్థలాన్ని జిల్లా న్యాయమూర్తితో కలిసి పరిశీలించారు. ఈ స్థలాన్ని సర్వే చేసి నివేదికలు అందజేయాలని వికారాబాద్ తహసీల్దారును కలెక్టర్ ఆదేశించారు.

పోడు పనుల్లో నిర్లక్ష్యం తగదు

వికారాబాద్ అర్బన్: పోడు భూముల పంపిణీ పనులు వేగిరం చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. బుధవారం ఆర్డీఓలు, తహసీల్దార్లతో పోడు భూములు, ధరణి సమస్యల పరిష్కారంపై టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్దార్లు పోడు భూముల పనుల పైనే దృష్టి కేంద్రీకరించాలన్నారు. రెండు రోజుల్లో నివేదికను జిల్లా స్థాయి కమిటీకి పంపాలన్నారు. 2005 కంటే ముందు కబ్జాలో ఉండి వ్యవసాయం చేసుకునే గిరిజనులను ప్రతిపాదించాలని సూచించారు. ధరణి సమస్యలు పరిష్కారం చేస్తూ కొత్త సమస్యలు ఉత్పన్నం కాకుండా జాగ్రత్త పడాలని సూచించారు. తహసీల్దార్లు తప్పులు చేస్తే సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు.

కొత్త బస్సులు కేటాయించరూ..



ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ను సన్మానిస్తున్న శుభప్రద్ పటేల్

అనంతగిరి: వికారాబాద్, తాండూరు ఆర్టీసీ డిపోలకు కొత్త బస్సులు కేటాయించాలని బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ ఎండీ సజ్జనార్‌ను కోరారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి సమస్యలపై విన్నవించారు. కాలంచెల్లిన బస్సులు మొరాయిస్తున్నట్లు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. తాండూరు ప్రాంతంలో బస్సు సౌకర్యం లేని గ్రామాలకు బస్సు సర్వీసులు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త బస్సులు కేటాయిస్తే ప్రయాణికులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని ఆయన తెలిపారు.

నేర నియంత్రణపై దృష్టి తప్పనిసరి

- అన్ని శాఖలకు వెన్నెముక పోలీసు శాఖ
- కలెక్టర్ నారాయణరెడ్డి

అనంతగిరి: అన్ని శాఖలకు వెన్నెముక పోలీస్ శాఖ అని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో అధికారుల పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలీసుశాఖ సమాజంలో శాంతి భద్రతలను కాపాడటంలో ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. జిల్లాలో నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించి, లా అండ్ ఆర్డర్‌కి ఇబ్బంది కలిగించే వారిపై సస్పెక్ట్ షీట్‌లు, హిస్టరీ షీట్‌లు నమోదు చేయాలన్నారు. ఇసుక అక్రమ రవాణా తదితర వాటిపై కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయం పని చేసుకుంటూ క్రమశిక్షణతో విధులు నిర్వహించలన్నారు. ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ పోలీసులు అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేస్తూ పని చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీసీ ఏఎస్పీ మురళీధర్, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ సీఈఓపై చీటింగ్ కేసు

- శనగల కొనుగోలులో అక్రమాలే కారణం
- మరో ఇద్దరు కార్మికుల అరెస్టు

బషీరాబాద్: నావంద్గీ సొసైటీలో జరిగిన శనగల కొనుగోలు అక్రమాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. రైతుల నుంచి బస్తాకు అదనంగా 10 కిలోల చొప్పున దోపిడీ చేసిన సీఈఓ వెంకటయ్యపై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. ఇందులో పాత్ర ఉన్న ఇద్దరు బీహారీ కార్మికులను బుధవారం అరెస్టు చేసి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. తాండూరు నియోజకవర్గంలో నావంద్గీ సొసైటీ ఏకైక శనగల కొనుగోలు కేంద్రం. ఇప్పటివరకు ఈ కేంద్రానికి 2వేల బస్తాల శనగలు వచ్చాయి. మార్క్‌ఫెడ్ నిబంధనల ప్రకారం.. రైతుల నుంచి సేకరించే ఒక్కో బస్తాకు 50 కిలోల 750 గ్రాముల శనగలు తూకం వేయాలి. కానీ సొసైటీ సీఈఓ బస్తాకు 60 కిలోలు తూకం వేయించారు. ఇది గమనించిన రైతులు పోలీసులకు, చైర్మన్‌కు ఫిర్యాదు చేయడంతో అక్రమాలు వెలుగుచూశాయి. ఈ వ్యవహారంలో ప్రధాన సూత్రదారి సీఈఓనేనని సొసైటీ ఉన్నతాధికారులు ప్రాథమిక విచారణలో బయటపడింది. రైతు నుంచి దోపిడీ చేసిన 2.50 క్వింటాళ్ల శనగలను తిరిగి బాధిత రైతుకు అందజేశారు. మిగతా బస్తాలను మరో సారి తూకం వేసి ఎక్కువగా ఉన్న శనగలను బస్తాల నుంచి తీశారు. మరోవైపు బాధిత రైతులతో పాటు చైర్మన్ వెంకట్రామ్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపిన ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి సీఈఓ వెంకటయ్య, కార్మికులు రవీందర్ బింద్, దీపక్‌కుమార్‌లపై కేసులు నమోదు చేశారు. మంగళవారం కార్మికులను రిమాండ్‌కు తరలించారు. సీఈఓను త్వరలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తామని చెప్పారు. ఇదిలా ఉంటే సీఈఓపై గతంలోనూ అవినీతి మరకలు ఉన్నాయి. అరెస్టు చేసిన అనంతరం సీఈఓను సస్పెండ్ చేస్తారని అధికారవర్గాలు తెలిపాయి.



నిందితులను మీడియాకు చూపుతున్న ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి

తాండూరుపై బీజేపీ ఫోకస్!

- నేడు రాష్ట్ర అధ్యక్షుడు బండిసంజయ్ రాక
- కార్యకర్తల్లో జోష్ నింపేందుకేనా?

తాండూరు: స్థానిక అసెంబ్లీ స్థానంపై బీజేపీ స్పెషల్ ఫోకస్ పెట్టిందా.. అవుననే అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. గత ఏడాది జరిగిన మునుగోడు ఎన్నికల సమయంలో మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో జరిగిన 'ఎమ్మెల్యేలకు ఎర' వ్యవహారంతో కమలం పార్టీ ఇరుకున పడింది. ఇందులో ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి కీలకంగా వ్యవహరించిన విషయం అందరికీ తెలిసిందే. ఈ క్రమంలో తాండూరు అసెంబ్లీ స్థానంపై కమల దళపతులు ప్రత్యేక దృష్టి సారించారు. అందులో భాగంగా గురువారం ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండిసంజయ్ తాండూరు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. కార్యకర్తల్లో జోష్ తీసుకువచ్చేందుకే ఈ పర్యటన ఉద్దేశమని పలువురు భావిస్తున్నారు.

తాండూరులో తొలిసారిగా..

బండిసంజయ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికయ్యాక తాండూరు నియోజకవర్గంలో తొలిసారిగా పర్యటించనున్నారు. తాండూరులో మాత్రం పార్టీ స్థానికంగా పట్టు సాధించడం లేదు. గతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ అభ్యర్థులకు 10 వేల నుంచి 12 వేల ఓట్లు మాత్రమే పోలయ్యాయి. దీంతో మూడు, నాలుగు స్థానాలలో నిలుస్తూ వస్తోంది. గతంలో టికెట్ ఆశించిన యూ.రమేష్ కుమార్ నాటి నుంచి పార్టీ కార్యక్రమాలు చేస్తూ వచ్చారు. గతేడాది బీఆర్ఎస్ నుంచి మాజీ మంత్రి చందుమహరాజ్ తనయుడు నరేశ్ మహరాజ్, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడైన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మురళీకృష్ణగౌడ్‌లు బీజేపీలో చేరారు. మండలాల్లో ఎవరికి వారు పార్టీ తరపున ప్రచారం చేస్తున్నారు. అయితే ఈ ముగ్గురు నేతలు పార్టీ టికెట్ ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఒకరిపై ఒకరికి పొసగడం లేదు. వారం రోజుల క్రితం మురళీకృష్ణపై కేసు నమోదు చేసి జైలుకు వెళ్లడంతో ఈ ఇద్దరు నేతలు ఖండించకపోవడం వర్గపోరుకు నిదర్శనం. మరోవైపు పార్టీ అధిష్టానం చేపట్టిన కార్యక్రమాలను సైతం సక్సెస్ చేయలేకపోయారనే ఆరోపణలు ఉన్నాయి.

సయోధ్య కుదిరేనా..

పార్టీ అధిష్టాన నేతలు తాండూరులో గెలిచి తీరాలని నేతలకు సూచనలు చేస్తున్నారు. వర్గపోరు వల్ల బీఆర్ఎస్ పార్టీని ఎదుర్కోవడంలో విఫలమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. మరోవైపు పార్టీ ప్రతిష్టను పెంచడంతో పాటు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి రాజకీయ జీవితాన్ని ఇరుకున పెట్టే విధంగా మురళీకృష్ణగౌడ్ ముందుకు సాగుతున్నారు. దీంతో అనుహ్యంగా యాలాల శివస్వాముల ఘటనతో జైలు పాలు కావాల్సి వచ్చింది. ఈ విషయంపై పార్టీ అధిష్టాన నేతలు సీరియస్‌గా పరిగణించారు. దిద్దుబాటు చర్యలకు కమల దళపతి రంగంలోకి దిగారు. గురువారం తాండూరు నియోజకవర్గంలోని యాలాల మండలం దేవనూర్ గ్రామంలో శివస్వామి కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు. అనంతరం తాండూరు పట్టణంలోని భావిగి భద్రేశ్వర దేవాలయ కూడలిలో పార్టీ స్ట్రీట్ కార్నర్ సభ నిర్వహించనున్నారు. తర్వాత తాండూరు నియోజకవర్గంలోని ముఖ్య నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. బండి సంజయ్ రాకతో పార్టీ నేతల మధ్య సఖ్యత కుదురుతుందా లేదా అనేది తేలనుంది.



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండిసంజయ్

పరిగిలోనూ పర్యటన

పరిగి: పట్టణంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పర్యటించనున్నట్లు బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతికిరణ్ తెలిపారు. మండల పరిధిలోని రూఫ్‌ఖాన్‌పేట్‌లో నిర్వహించే శక్తి కేంద్ర కార్నర్ సమావేశానికి హాజరుకానున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

సేవలే గుర్తుండిపోతాయి



ఏఎస్పీ రషీద్‌ను సన్మానిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: ప్రజలకు మనం చేసిన సేవలే చిర కాలం గుర్తుండిపోతాయని ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. వికారాబాద్ ఏఎస్పీగా విధులు నిర్వహించిన ఎంఏ రషీద్ బదిలీపై సైబరాబాద్‌కు వెళ్లారు. బుధవారం కార్యాలయం ఆవరణలో ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఉద్యోగ రీత్యా బదిలీలు సాధారణమేనన్నారు. ఎక్కడ పనిచేసినా ప్రజలతో మమేకమై విధులు నిర్వహిస్తే మంచి గుర్తింపు వస్తుందన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

సుద్ద వాహనం సీజ్



పోలీసులు సీజ్ చేసిన సుద్ద వాహనం

పెద్దేముల్: రాయల్టీ లేకుండా అక్రమంగా తరలిస్తున్న ముడి సుద్ద వాహనాన్ని బుధవారం పెద్దేముల్ పోలీసులు సీజ్ చేశారు. ఎస్ఐ అబ్దుల్‌రవూఫ్ కథనం మేరకు.. మండలంలోని తింసాన్‌పల్లి నుంచి సుద్దను వాహనంలో అక్రమంగా తరలిస్తుండగా సీజ్ చేశారు. టిప్పర్‌ను మైనింగ్ శాఖ అధికారులకు అప్పగించారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు



పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

కుల్కచర్ల: నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని కుల్కచర్ల ఎస్ఐ గిరి హెచ్చరించారు. బుధవారం మండలంలోని పటేల్ చెరువు తండా సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. డ్రైవర్ తిరుపతిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పేదల ఇళ్ల స్థలాలను సర్వే చేయండి

కొందుర్గు: పట్టణ శివారులో ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలకు సంబంధించిన భూమిని సర్వే చేయాలని లేకుంటే తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య హెచ్చరించారు. కొందుర్గులోని ఏనెగడ్డలో గతంలో వేసుకున్న తాత్కాలిక గుడిసెలను సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు ఇళ్ల స్థలాలు చూపించాలని గతంలో పలుమార్లు సీపీఐ ఆధ్వర్యంలో పోరాటాలు చేసినా అధికారులు స్పందించడం లేదని విమర్శించారు. పేదలు ఆ స్థలంలో గుడిసెలు వేసుకొని 100 రోజులు దాటినా అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. సర్వేచేయించాలని కోరితే వివిధ సాకులు చూపుతూ అధికారులు కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకొని పేదలకు న్యాయం చేయాలని లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

బిల్లులు రాక.. సర్పంచుల గోస తీరక

- రెండేళ్ల క్రితం రైతు వేదికల నిర్మాణం
- నేటికీ అందని బిల్లులు
- వడ్డీలు కట్టలేక పోతున్నామని ఆవేదన
- వెంటనే మంజూరు చేయాలని వినతి

పెద్దేముల్: రైతు వేదికలు నిర్మించి బిల్లులు రాక అప్పుల పాలవుతున్నాం. పనులు పూర్తి చేసి రెండేళ్లయినా డబ్బులు ఇవ్వలేదు. దీంతో చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక నానా ఇబ్బందులు పడుతున్నాం. మా గోస ఎవ్వరికి చెప్పినా లాభం లేదు అంటూ మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు వాపోతున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో పలు గ్రామాల్లో రైతు వేదికలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు చేరువలో అధికారులు, విత్తనాలు, ఎరువులు ఉండాలన్న లక్ష్యంతో మండలంలోని ఇందూర్, మంబాపూర్, కందనెల్లి, పెద్దేముల్, తట్టెపల్లి, గోపాల్‌పూర్ గ్రామాలకు రైతు వేదికలను మంజూరు చేసింది. ఒక్కో రైతు వేదికను రూ. 22లక్షలతో నిర్మించాలని భావించింది. ఇందుకు అనుగుణంగా ఆదేశాలు జారీ చేసింది. పై గ్రామాల సర్పంచులు పనులను ప్రారంభించారు. ఇప్పటి వరకు 90శాతం పనులు పూర్తయినా ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాలేదని సర్పంచులు వాపోతున్నారు. ఒక్కో రైతు వేదికకు సుమారు రూ. 20లక్షల వరకు ఖర్చు చేశామని, ప్రభుత్వం తూతూ మంత్రంగా నిధులు మంజూరు చేసి చేతులు దులుపుకుందని ఆరోపించారు. దీంతో పనులు ఎలా పూర్తి చేయాలో అర్థం కావడం లేదని వారు తెలిపారు. ఇందూరు గ్రామంలో రైతు వేదిక నిర్మాణ పనులు పూర్తయ్యాయి. కానీ బిల్లు అందలేదని సర్పంచ్ పద్మమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. రైతు వేదికకు, క్రిమిటోరియానికి, ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా వేసిన సీసీ రోడ్లతో పాటు పలు అభివృద్ధి పనులకు సుమారు రూ. 20లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉందని తెలిపారు. పెద్దేముల్‌లో రైతు వేదిక పనులు 90శాతం పూర్తయినా ఇంకా రూ. 5లక్షల వరకు బిల్లు రావాల్సి ఉందని సర్పంచ్ ద్యావరి విజయమ్మ తెలిపారు. మంబాపూర్ పంచాయతీలో రైతు వేదికను ఏడాది క్రితం మంత్రి సబితారెడ్డి ప్రారంభించినా నేటికీ పూర్తి స్థాయిలో బిల్లులు అందలేదని, సంబంధిత అధికారులకు అడిగితే నేడు రేపు అంటూ ఏడాది నుంచి కాలయాపన చేస్తున్నారని మండి పడుతున్నారు. పనులు పూర్తి చేసి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని గోపాల్‌పూర్ సర్పంచ్ రాములు ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు చేశామని, వాటి తీర్చలేక నేడు తల దాచుకోవాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బకాయి నిధులు మంజూరు చేయాలని పలు గ్రామాల సర్పంచులు కోరుతున్నారు. ఈ విషయమై పెద్దేముల్ పంచాయతీ రాజ్ ఏఈ సిద్ధార్థను వివరణ కోరగా మార్చి వరకు బిల్లులు పూర్తి కావచ్చని తెలిపారు. మండలంలో ఆరు రైతు వేదికలకు రూ. 10లక్షలకు పైగా బిల్లులు రావాల్సి ఉందని తెలిపారు. త్వరలో బిల్లులు మంజూరవుతాయని అన్నారు.



నిధులు అందక అసంపూర్తిగా ఉన్న పెద్దేముల్ రైతు వేదిక

పైసలు ఇస్తేనే ప్రారంభం



పంచాయతీల్లో చేసిన అభివృద్ధి పనులకు ప్రభుత్వం బిల్లులు మంజూరు చేస్తేనే ఆట్టి భవనాలను ప్రారంభిస్తాం. వివిధ అభివృద్ధి పనులకు రూ. 20లక్షల వరకు బకాయిలు రావాల్సి ఉంది. ఏ అధికారిని అడిగినా సరైన సమాధానం ఇవ్వడం లేదు. సకాలంలో పనులు చేసి అప్పుల పాలవుతున్నాం. మా గోడు మండల సర్వసభ్య సమావేశంలో తెలియజేశాం. అయినా పట్టించుకోలేదు. వెంటనే బిల్లులు మంజూరు చేయాలి.

– పద్మమ్మ, సర్పంచ్, ఇందూరు

నిధులు మంజూరు చేయాలి



రైతు వేదికలకు ప్రభుత్వం వెంటనే నిధులు వెంటనే మంజూరు చేయాలి. పనులు పూర్తి చేసి ఏడాది అవుతోంది. పనులు పూర్తయిన వెంటనే డబ్బులు ఇస్తామన్నారు. నేటికీ బిల్లులు అందక నానా ఇబ్బందులు పడుతున్నాం. వాటితో పాటు మిగితా అభివృద్ధి పనులకు కూడా సక్రమంగా బిల్లులు అందడం లేదు. ఈ విషయాన్ని మండల అధికారులకు వివరించాం. కానీ లాభం లేదు. ప్రభుత్వం వెంటనే స్పందించాలి.

– విజయమ్మ, సర్పంచ్, పెద్దేముల్

వెంటనే బిల్లులు ఇవ్వాలి



గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులు పూర్తయిన వెంటనే ప్రభుత్వం బిల్లులు చెల్లించాలి. అప్పుడే పనులు చేయాలంటే ఆసక్తి కలుగుతుంది. పనులు చేసిన ఏళ్ల తరబడి బిల్లులు రాకపోతే సర్పంచ్ ఉన్నా ఒక్కటే.. లేకున్నా ఒక్కటే అనిపిస్తోంది. ప్రభుత్వం బకాయి బిల్లులను వెంటనే మంజూరు చేయాలి.

– శ్రావణ్‌కుమార్, సర్పంచ్, మంబాపూర్

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలు మృతి



అరుణ(ఫైల్)

పూడూరు: రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలు మృతి చెందిన సంఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని అంగడిచిట్టంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పని చేస్తున్న అరుణ విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై వికారాబాద్‌కు బయలుదేరింది. మార్గమధ్యలో కండ్లపల్లి గేటు వద్ద స్కూటీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అరుణను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విఠల్ రెడ్డి తెలిపారు. అరుణ మృతి వార్త తెలుసుకున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు, అంగడిచిట్టంపల్లి సర్పంచ్ జయమ్మ, తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతాపం తెలిపారు.

పరిశ్రమపై ఫిర్యాదు

తాండూరు రూరల్: మండలంలోని మల్కాపూర్ శివారులో ఉన్న ఐసీఎల్ సిమెంట్ ఫ్యాక్టరీపై రైతు జక్లపల్లి కిష్టప్ప బుధవారం తాండూరు తహసీల్దార్ చిన్నప్పల నాయుడుకి ఫిర్యాదు చేశారు. ఫ్యాక్టరీ చుట్టు ఉన్న తమ పంట పొలాల్లో సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే దుమ్ము, ధూళితో పంటలు పాడవుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫ్యాక్టరీ యజమాన్యం రైతులకు పరిహారం చెల్లించాలని కోరారు.

మహనీయుడు సేవాలాల్ మహరాజ్

- బంజారాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి
- ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు టౌన్: బంజారాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి అన్నారు. బుధవారం గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ 284వ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. స్థానిక చించోళి రోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సేవాలాల్ మహరాజ్ గిరిజనుల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. గిరిజనులను ఆర్థిక బలోపేతానికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. తండాలకు గ్రామ పంచాయతీల హోదా కల్పించినట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజనులకు అండగా ఉండి, వారు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో ఆలిండియా బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి వాసుపవార్ నాయక్, పెద్దేముల్ మండల జెడ్పీటీసీ ధారాసింగ్, గిరిజన నాయకులు, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజుగౌడ్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నయీమ్, నాయకులు పట్లోళ్ల నర్సింలు, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.



సేవాలాల్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

బయోమెట్రిక్‌తో జవాబుదారీతనం

ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు

కొడంగల్: నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బయో మెట్రిక్ విధానం ఏర్పాటు చేశారు. ఈ విధానం వల్ల ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తున్నారు. కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాల్లో పూర్తి స్థాయిలో బయోమెట్రిక్ ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. బయోమెట్రిక్ లేని పాఠశాలల్లో కొందరు ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. అన్ని పాఠశాలల్లో ఈ విధానం అమలు చేస్తే ఉపాధ్యాయులు సకాలంలో పాఠశాలకు వచ్చే అవకాశం ఉంటుందని విద్యావంతులు అంటున్నారు. కొందరు ఉపాధ్యాయులు హైదరాబాద్, మహబూబ్‌నగర్, వికారాబాద్, పరిగి, తాండూరు పట్టణాల నుంచి నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. మరి కొంతమంది ఉపాధ్యాయులు విద్యావలంటీర్లను నియమించుకొని పాఠశాలలకు ఎగనామం పెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బయో మెట్రిక్ విధానం అమల్లో ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయులు సకాలంలో విధులకు వస్తున్నారని పలు గ్రామాల ప్రజల సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. తహసీల్దార్ కార్యాలయంలో బయోమెట్రిక్ విధానం అమల్లో ఉంది. రెవెన్యూ సిబ్బంది సకాలంలో కార్యాలయానికి వస్తున్నారని జనం అంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో బయో మెట్రిక్ విధానం అమలు చేయడం మంచి నిర్ణయమని పలువురు అంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా బయో మెట్రిక్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అధికారుల్లో జవాబుదారితనం పెరుగుతుందని పారదర్శకంగా పనిచేస్తారని పలువురు పేర్కొన్నారు.



పాత కొడంగల్ తండా పాఠశాలలో ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ యంత్రం

అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి, అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ యువ నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి నిర్వహిస్తున్న ప్రగతి నివేదన పాదయాత్రలో భాగంగా మంగళవారం రాత్రి రాయపోల్ గ్రామంలో నిర్వహించిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. తాను మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పుడు ప్రతిపక్షంలో ఉన్నానని, అప్పుడు అంతగా అభివృద్ధి చేయలేకపోయినట్లు చెప్పారు. తదుపరి ఎమ్మెల్యేగా గెలిచిన రెండుసార్లు కేసీఆర్ నాయకత్వంలో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. గతంలో మంచినీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారిని, ఇప్పుడు ఆ సమస్య లేదన్నారు. రాయపోల్‌లో బీటీ, సీసీ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మిషన్ భగీరథ పైపులైన్లు, చెరువుల్లో పూడిక తీత, మరమ్మతుల కోసం రూ. 14. 87 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. పెన్షన్లు, రైతు బంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్, కేసీఆర్ కిట్లు తదితర పథకాల ద్వారా వందలాది మంది లబ్ధి పొందినట్లు ఎమ్మెల్యే వివరించారు. సొంత జాగా ఉంటే ఇంటి నిర్మాణానికి 3 లక్షలు ప్రభుత్వం కేటాయించనున్నట్లు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి గ్రామం అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు ఎంకేఆర్ ఫౌండేషన్ ద్వారా యువతకు శిక్షణ ఇప్పించి సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రశాంత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేయాలన్న సంకల్పంతో వారి సమస్యలు తెలుసుకునేందుకు ఈ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కృపేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య, సర్పంచులు బల్వంత్‌రెడ్డి, శివరాల జ్యోతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బుగ్గరాములు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. బుధవారం ముకునూర్ గ్రామంలో మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి పాదయాత్ర కొనసాగింది. వృద్ధులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు స్వాగతం పలికారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

కల్వర్టులు.. ప్రమాద ఘంటికలు

- కూలిపోయి రెండేళ్లవుతున్నా పట్టించుకోని అధికారులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న వాహనచోదకులు

బంట్వారం: కూలిన కల్వర్టులకు మరమ్మతులు చేయకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారాయి. సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు మాత్రం తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లోని రొంపల్లి, నూరుల్లాపూర్, ఎన్కెపల్లి, కోట్‌పల్లి – తాండూరు మార్గంలోని కల్వర్టులు కూలి రెండేళ్లు గడుస్తోంది. అయినా వాటిని తిరిగి నిర్మించలేదు. అసలే గుంతలు పడిన రోడ్లు ఆపై అక్కడక్కడ కూలిన కల్వర్టులు ఉండడంతో వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎన్కెపల్లి రోడ్డులో మూల మలుపు వద్ద కల్వర్టుపై పెద్ద గుంత పడింది. కొత్త వారు ఆదమరిచి అతివేగంగా వెళితే గుంతలో పడే ప్రమాదం ఉంది. ఇప్పటికే పలువురు గాయపడ్డారు. ద్విచక్ర వాహనదారులు రాత్రి వేళ అటుగా వెళ్లాలంటేనే జంకుతున్నారు. కూలిన కల్వర్టుల వద్ద లోడింగ్ లారీలు బస్సులు దిగబడే అవకాశం ఉంది. ఆర్అండ్‌బీ శాఖ తరఫున కనీసం హెచ్చరిక బోర్డులు కూడా పెట్టలేదు. దీంతో వాహనదారులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రాణాలు పోతేగాని స్పందించరా అంటూ నిలదీస్తున్నారు. ఇప్పటికైనా సత్వరమే తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఎన్కెపల్లి కల్వర్టుపై ఏర్పడిన గుంత



నూరుల్లాపూర్ సమీపంలో కూలిన కల్వర్టు

మరమ్మతులు చేపట్టాలి



కూలిన కల్వర్టుల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రొంపల్లి, నూరుల్లాపూర్, ఎన్కెపల్లి తదితర మార్గాల్లో కల్వర్టులు కూలి రెండేళ్లు గడుస్తోంది. అయినా ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదు. సమస్య తీవ్రత ఇంతగా ఉన్నా కనీస మరమ్మతులు కూడా చేయడం లేదు. ఇప్పటికైనా పాలకులు సమస్యలపై దృష్టి సారించాలి.

– నర్సింలు, రొంపల్లి

నిధులు మంజూరు

కూలిన కల్వర్టులను తిరిగి నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం. రెండేళ్ల నుంచి జాప్యం జరిగిన మాట వాస్తవమే. నూరుల్లానూర్ వద్ద కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ పూర్తి కాగానే పనులు చేపడతాం. ఎన్కెపల్లి, రొంపల్లి, కోట్‌పల్లి – తాండూరు మార్గంలోని కల్వర్టులకు ప్రతిపాదనలు పంపుతాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.

– మనోజ్‌కుమార్, ఏఈ, ఆర్అండ్‌బీ

సైక్లింగ్‌తో సంపూర్ణ ఆరోగ్యం

డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి

షాద్‌నగర్: నిత్యం సైక్లింగ్ చేయడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి అన్నారు. బుధవారం పట్టణంలోని మినీ స్టేడియంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సైక్లింగ్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించి మాట్లాడారు. ప్రతి రోజూ వ్యాయామం చేస్తే మనిషి ఆరోగ్యంగా ఉంటారన్నారు. అరగంట పాటు సైకిల్ తొక్కడం వల్ల కొవ్వు వేగంగా కరుగుతుందన్నారు. అదేవిధంగా శరీర బరువుతో ఇబ్బంది పడే వారికి సైక్లింగ్ ఎంతో ఉపయోగంగా ఉంటుందని అన్నారు. మనిషికి గుండె జబ్బులు వచ్చే అవకాశం యాభైశాతం తగ్గుతుందన్నారు. సైక్లింగ్ శరీరం కోసమే కాకుండా మనస్సుకు మంచి ఉల్లాసాన్ని ఇస్తుందని, ఒత్తిడిని జయించవచ్చని అన్నారు. అంతే కాకుండా ఏకాగ్రత కూడా పెరుగుతుందన్నారు. పౌష్టికాహారం తీసుకోవడంతోపాటు ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో విధిగా వ్యాయామం, సైక్లింగ్ చేయడంతో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఆరోగ్య సమస్యలు ఎదురైతే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు స్రవంతి, ఆనంద్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ల్యాబ్ టెక్నీషియన్, సిబ్బంది రాజు, చెన్నయ్య, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెపా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సంజీవన్ కుమార్

మొయినాబాద్: ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అమ్డాపూర్ పాఠశాల ఉపాధ్యాయుడు బొట్లపల్లి సంజీవన్‌కుమార్ ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు కొత్తగట్టు శ్రీనివాస్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ నియామకపత్రాన్ని అందజేశారు. పరిగి మండలం రావులపల్లికి చెందిన సంజీవన్‌కుమార్ ముదిరాజ్ మొయినాబాద్ మండలంలోని అమ్డాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్ జాతి అభ్యున్నతికి, విద్యార్థుల ఉన్నతికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. మెపాను విస్తరించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

వారం రోజుల్లో డబ్బాలను తొలగించాలి

డీఎల్‌పీఓ శంకర్‌నాయక్

పెద్దేముల్: మండలంలోని మంబాపూర్‌లో తాండూరు – హైదరాబాద్ ప్రధాన రహదారి పక్కన ఉన్న డబ్బాలను వారం రోజుల్లో తొలగించాలని డీఎల్‌పీఓ శంకర్‌నాయక్ ఆదేశించారు. మంబాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి రోడ్డు పక్కన ఉన్న డబ్బాల వల్ల ఇంటికి వెళ్లేందుకు మార్గం లేదని, దీంతో నానా ఇబ్బందులు పడుతున్నామని కలెక్టర్ నారాయణరెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం డీఎస్‌పీఓ గ్రామాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. డబ్బాల యజమానులతో మాట్లాడారు. ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన, కోటపల్లి ప్రాజెక్టు కాలువలపై ఉన్న డబ్బాలను వారం రోజుల్లో తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. అక్రమంగా వేసిన డబ్బాల తొలగింపునకు ఏడు రోజులు గడువు ఇవ్వడంతో పాటు పంచాయతీ నుంచి నోటీసులు ఇవ్వాలని కార్యదర్శి సంజీవ్‌కు ఆదేశాలు జారీ చేశారు. గడువు ముగిసిన వెంటనే వాటిని యంత్రాల ద్వార తొలగించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రావణ్‌కుమార్, ఎంపీటీసీ శ్రీనివాస్, ఎంపీఓ షేక్ సుస్మా, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



మంబాపూర్‌లో రోడ్డు పక్కన ఉన్న డబ్బాలను పరిశీలిస్తున్న అధికారులు

ప్రమాదకర పరిశ్రమను మూసివేయాలి

యాచారం: ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన కొత్తపల్లిలోని ఆగ్రో ఫీడ్ కంపెనీని మూసి వేయాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. ఆగ్రో ఫీడ్ కంపెనీ పేరుతో పశువుల కళేబరాలు, మాంసం ముద్దలు తెచ్చి నూనె తయారు చేస్తున్న పరిశ్రమపై సర్కార్‌కు ఎందుకంత ప్రేమ అని ఆయన ప్రశ్నించారు. సీపీఎం బృందం బుధవారం కొత్తపల్లిలోని పరిశ్రమను పరిశీలించి గ్రామస్తులు చేస్తున్న నిరాహార దీక్షకు మద్దతు పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజల ప్రాణాలకు ముప్పుగా ఉన్న కంపెనీని మూసేయాలని ప్రజలు 14 రోజులుగా ఆందోళన, ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. ప్రజల ప్రాణాల కంటే కేసీఆర్ సర్కార్‌కు కంపెనీ ప్రయోజనాలే ముఖ్యమా అని ప్రశ్నించారు. కంపెనీ నుంచి వచ్చే దుర్వాసన వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం ప్రమాదకర పరిశ్రమను మూసివేయాలని, లేకుంటే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, జిల్లా కార్యవర్గ సభ్యులు బీ మధుసూదన్‌రెడ్డి, జగదీష్, జిల్లా కమిటీ సభ్యులు కిషన్, కుమార్, సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ, కొత్తపల్లి గ్రామ ఉప సర్పంచ్ కావలి జగన్, నాయకులు విప్లవ్‌కుమార్, పరమేష్ కుమార్, బుగ్గరాములు, కుమార్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ

దంపతులకు గాయాలు

కేశంపేట: ఎదురెదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ కొనడంతో బైక్‌పై ప్రయాణం చేస్తున్న దంపతులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని ఇప్పలపల్లి శివారులో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, బాధితుల కథనం మేరకు.. ఫరూఖ్‌నగర్ మండలం పెద్ద చిల్కమర్రి గ్రామానికి చెందిన కంటె ఆంజనేయులు అతడి భార్య లక్ష్మీ బైక్‌పై కడ్తాల్‌కు వెళ్తుండగా మండలంలోని ఇప్పలపల్లి శివారులో ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆంజనేయులుకు కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. వెనుక కూర్చున్న అతని భార్యకు గాయాలయ్యాయి. ఇరువురిని శంషాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బస్సును అజాగ్రత్తగా నడిపిన డ్రైవర్ రాములుపై చర్యలు తీసుకోవాలని బాధితుడి కుమారుడు మనీష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.